# పిశాచం

శ్రీ వాసుదేవ రావు

"మనూ" జవాబు లేదు.

నాకు కోపం వచ్చింది. ఎందుకురాదు? నాకు జ్వరంతగిలి కోర్టులో కూర్చోలేక యింటికి వచ్చాను. తలవాకిలి మూసివుంది. నాలుగు పిలుపులు పిలిచాను. తలుపుతీయలేదు. ఎండలో నిలిచాను. ఎంతసేపు నిలవనూ? కాళ్లుగజగజావణికి పోతూన్నవి. తలుపు బద్దలయ్యేటట్టు కోపంతో తట్టాను.

"మనూ! తలుపు." అన్నాను.

"ఆఁ!"

తలుపు తెరిచింది. నేను గడపలోపల అడుగుపెట్టాను. మను నన్ను చూచింది. నేనూ మనూముఖంకేసి చూచాను. మనూమొహం వెలవెలబారింది. గాభరాపడ్డది మను. నేను పలుకలేదు. మనూ నన్ను పలుకరించలేదు. నాకంటే ముందుగా లోపలికి నడిచింది మను. నేనూ వెంటనే పోయినాను. మను వంటయింటిలోకి పోతూ తనగదితలుపు ముందుకు తోసుకుని వెళ్లి పోయింది. నేను నాగదిలోకివెళ్లి డ్రెస్సుతీసి మంచంమీద పరున్నాను. కాని, ఒంటరిగా వుండలేక పోయినాను. మనూగదిలోకి వెళ్ళాను పరుందామని. ఇటు తిరిగిచూచే సరికి మేజాబల్లమీద టోపి ఒకటి కనబడ్డది. వెండీబంగారు జరీ చంకీబుటేదారీపనితనం, బహు అందంగా ఉంది. చాలా [illegible]లగలది. గొప్ప జమీందారుల కుండవలసింది. ఎవరిదీ టోపి? ఇక్కడికి ఎట్లా వచ్చింది? బల్లను సమీపించాను. టోపీని తీసి పరీక్షించాను. అది చిన్న పిల్లవానిదికాదు. నాయీడువానిది. నా తలకు సరిపోయ్యేది. నాగుండెలోగుభిల్లు మన్నది. కడుపులో ఒక విధంగా వికారంపుట్టు కొచ్చింది. కన్నులు గిర్రున తిరిగి పోయినవి. నిలవలేక పోయినాను. కూలి అక్కడే పడిపోయినాను.

ఆతర్వాత నేమి జరిగిందో నాకు తెలియలేదు. ఆస్థితిలో నేనెంత సేపున్నానో తెలియలేదు. కండ్లుతెరచి చూచేసరికి మను నాపక్కన కూర్చున్నది. ఒక్కచేతితో నాతల ఒత్తుతూన్నది. నేను కండ్లు తెరిచేసరికి నామీదవున్న మనూ చూపులు నేలవంకకు మరలినవి. పెదవులింమక విడివడినవి. పలువరుస కొంచెముగా కనబడ్డది.

"టీ చల్లారి పోతూంది. లేచి తాగుదురూ? సుస్తీగా ఉన్నారు. తలనొప్పిస్తున్నదా? జ్వరం తగిలి నట్టుంది." అన్నది మను.

నేను బదులు మాట్లాడ లేదు.

"'టీ' తాగండీ, డాక్టర్ను పిలిపిస్తాను" అన్నది దైన్యంతో.

నిజానికేమిగాని, అప్పుడు నేను మానవలోకంలోవుంటేనా? కడుపులో యెన్నెన్నో ఆలోచనలు పుడుతున్నవి. అంతరిస్తూన్నవి. ఎట్లాగో నాదృష్టి బల్లమీదనున్న టోపిమీదికి తిరిగి పోయింది. మాయం! టోపి బల్లమీద లేదు! మాయమై పోయింది. మనూవైపు చూచాను. మను తిరిగి తలవాల్చింది, చిరునవ్వు మొహానతోచింది. దాచేసింది. మాయలమారి! ఏమీయెరగనట్టు నాపక్కన కూర్చున్నది. ఒక్కనిమిషం అట్టే చూచాను.

"'టీ' కాచి చాలాసేపయింది. లేచితాగుదురూ; మంచాని కడ్డంగా పరున్నారేల? లేచి సరిగా పరుండవచ్చు. కాళ్లు తీపులా? ఒత్తనా?" అని మను 'టీకప్పు' నాచేతి కందిచ్చింది.

నేను లేవలేక పోయినాను. ఎందుకు? పడ్డది పెద్ద బండ హృదయంలో! అట్టే తాగేశాను. కండ్లు మూశాను.

"డాక్టర్ని పిలిపించనా?" అని మను నాకాళ్లు పిసుకుతో దిక్కు మొహంపెట్టి అడిగింది.

ఆచేతులు నాపాదాలమీద పడడంతోటే భగ్గుమండింది. కాళ్లు విదిలించుకున్నాను. మరోమొహంపెట్టి పరున్నాను? మనసు పరిపరి విధాలా పోతూన్నది. గుండెలు దడదడ కొట్టుకుంటున్నవి, మనసు విచారంలో మునిగి పోయింది.

"దాచేసింది! మాయలమారి! ఏమీయెరగనట్టు నటిస్తూంది! నేను చూడలేదనుకుంది! ఎందుకు దాచేసింది? ఏమీ భయంలేకపోతే యెందుకు దాచాలె? ఏదోవుంది! ఉంది. ఎక్కడ దాచింది? ఎక్కడ దాచి వుంటుంది! దొంగవస్తువు నింట్లో దాచిపెట్టుతుందా? ఏమో? నేను చూడలేదనుకుని యిక్కడే దాచరాదా? రేపోమాపో సమయం కనిపెట్టి యెవరిది వానికిచ్చివేయరాదా? ఇంట్లో నేవుంటుంది? ఎట్లా దొరకుతుంది? ఉంగో లేదో? వెదకుతాను. ఏమను కుంటుందో? ఎందుకింతానుమానం అనుకుంటుందేమో! తాళంచెవు లిమ్మంటే యేమనుకుంటుందో? ఎందుకంటే ఏమననూ? ఎదుటకాదు. చాటున వెదకాలె." అని నాలోనే ఆలోచించుకున్నాను.

"ఉస్సు! మనూ, నాకాయాసంగా ఉంది. ఒక్క గంటసేపు నన్ను నిద్రపోనీ. అంతవరకూ నాదగ్గరికి రాకు." అని నేనిట్లుమొగమై అన్నాను.

"అయితే, కాస్తసేపు నిద్రించండీ; వంటచేసి పెట్టివచ్చి డాక్టర్నిని పిలిపిస్తాను. ఒంటరిగా వుండలేకపోతే నన్ను కేక వేయండీ" అని మహాప్రేమతో అని మను వెళ్లిపోయింది.

నేను తలచినట్టు నాకొంటిపాటు చిక్కింది. తలుపులోపలవైపున గొళ్ళెంపెట్టాను. గదిలో వెదక ఆరంభించాను. తాళపు చెవులగుత్తి తలగడ కిందవున్నది; తీశాను. పెట్టెలన్నీ తెరచిచూచాను. బీరువాలో వెదకాను. అల్మారులలో పరీక్షించాను. బల్లసొరగులలో చూచాను. లేదు. ఎక్కడాలేదు. ఇంతల్లో నేమైవుంటుంది? లేదు. ఇంట్లోలే దాటోపి. వానిది వానికే పంపించేసింది. అవకాశమేది? ఎంతవకాశంకావలె? ఎంతసేపుకావలె! గజంత! ఛీ-ఛీ!

తిరిగి మంచం మీద పడ్డాను. విచారంలో మునిగి పోయినాను. మనసు వేయి విధాల పోతూన్నది. ఏది నిజమో, యేది కాదో, యెవరు చెప్పగలరు? ఇంతకాలం నుంచీ నన్నెంతో ప్రేమిస్తున్న నామను యిప్పు డీలా చేస్తుందా? చేయకపోతే, తలుపు తీయడాని కింతాలస్యం దేనికి? నేను కోర్టులోనుండి వచ్చేవేళ కాలేదుకదా యింతలో రాననుకున్నది! మోసపోయింది. నేను తనగదిలోకిప్పుడే రాననుకున్నది. రాకూడదనే కాబోలు తలుపులు ముందుకు తోసికొని తొరతొరగా నడచి దొడ్లోకి పోయింది? నేను నాగదిలోకి పోయి, డ్రెస్సుతీసేలోపలనో, కాక, తలుపుతీసే లోపలనో, గాభరాపడి తరిమివేసింది! ఆగాభరాలో, ఆహడావిడిలో, టోపి మరిచిపోయినాడు. మను తలుపు తెరిచింది! నన్ను చూచింది! కోర్టునుంచి ఈవేళముందుగా వచ్చినాననీ, అందులోనూ యీలాటి వేళకాని వేళకు వచ్చినాననీ, తెల్లబోయింది! నాకంటే ముందుగాబోయి నాకంట బడకుండ జాగ్రతచేసింది. నేను తనగదిలోకి వెళ్లననుకుంది; కాని, నాకర్మం, నన్నిక్కడికే లాక్కునివచ్చింది. గుట్టు బయటపెట్టింది టోపి! తిరిగి, యేమీ యెరగనట్లు, వగలమారి! ఎంతసాహసం! ఎన్నాళ్లనుంచీ యీలా జరుగుతున్నదో? ఒకసారి, రెండుసార్లుచేసే దొంగతనాలు బయటికిరావు. ఎంతోకాలం నుంచీ చేస్తూన్న దొంగతన మేఒక్కసారి బయటపడతవి. పాపఘటం నిండవద్దూ? నేడు బయటపడ్డది. రోజూ నింతే నేమో? ఇంక వేరేప నేముంది? నే నన్నంతిని కోర్టుకు వెళ్లిపోగానే సాయింత్రమింటికి మళ్లీ వచ్చేవరకు—ఎంత తీరిక! ఇంతేనేమో! ఆహాహా! ఎంతకాలం దాగింది? నేను కండ్లుమూసుకుని పాలుతాగానా? ఎంగిలిపాలు తాగానా? ఛీ-ఛీ-వ్యర్థం నా జన్మం. ఈబాధపడడంకంటే వురిపోసుకుని చచ్చేదే మేలనిపిస్తూంది! ఇంతటి నిర్భాగ్యురాలైనదా మనూ? "మనూ, మనూ, ఎంతటిదానవు? ఎంతలో, ఎంతచేసినావే! నీప్రేమఅంతా నిజమనుకుని మహానందసాగరంలో తేలుతూన్నాను. గదే! అన్నినటన అనుకోలేదే! మోసమనుకోలేదే! నీవగలు నాకు తెలియక మోసపోయినాను కదే! మనూ, మనూ! ఇంతటి నీచానికొడికట్టావే! అబ్బబ్బబ్బా! తల వ్రూడిపడిపోయే టట్లున్నదే!" అని నాలోనేను పరిపరివిధాల ఆలోచనలో మునిగాను. దుఃఖం, కోపం,

అన్యాయం, మానభంగావస్థ, ఇన్ని అవస్థలూ, యింకా కొన్ని అవస్థలు, నన్ను దహిస్తున్నవి. నాతల చీలిపోతుందేమో అనిపించింది. అంతలో నాతల రెండుచేతులతో పట్టుకున్నాను. అంతలో మను నాదగ్గరికి వచ్చింది. నాచేతులు మెల్లగా తొలగించి తన చేతులతో నాతల పట్టింది. ఈచేతులు నాకు తెలుసును! ఆచేతులు నాకు తగిలేసరికి నాదేహం గగుర్పొడిచింది! అరకాలి మంట నెత్తికెక్కింది! చేతులు విసిరేశాను. ఎందు కనుకుందో? నన్నోరచూపుల చూచింది. నేనూ ఆసమయంలోనే క్రీగంట చూచాను. చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నిస్తూన్నట్టు కనబడ్డది. కాని, అరక్షణంలోనే, పెదవులు స్ఫురించినవి. కన్నులనుండా గంగ భవాని ప్రవహిస్తూన్నది. దేనికి? వగలమారి! నా కామాత్రం వగలు తెలియదనుకొన్నది పాపం!

"తలనొప్పి చాలా బాధగా వున్నదా? 'అమృతాంజనం' రుద్దనా? సొంఠిపాలు కలికంపెట్టనా? ఇట్లుంటే నేలాగా? నా కేమీ తోచటం లేదు. డాక్టర్ని పిలిపించనా?" అని పుట్టెడుప్రేమతో, సహాయతో అడిగింది మను.

వగలమారి! ఎంతప్రేమ! నాకొడలు మండి సాగింది. ఈవగలెందుకో? ఇంకెందుకుంటుంది? చేసిన నేరం దాచడానికే! నాకు అనుమానం కలగ కూడదనే! ఇంతమాత్రం చేతనే నాకండ్లు కప్పేయగలదా! పెట్టింది పెద్దటోపీనాకు! ఇంతకాలంనుంచీ కండ్లుమూసికునే వున్నాను. దాచింది—ఎంతకాలందాగుతుంది? ఎంతదాచినా నిది దాగుతుందా? పాపం నిండింది. బయటపడ్డదీవేళ! మనూ, నామనోహరి, యింతటి విశ్వాసం మాలినదైనదా? నామనోహరి, నన్నెంతో ప్రేమిస్తూన్న నామనోహరి, నన్నే పరమదైవంగా భావిస్తూ సకలవిధాలా నన్ను సుఖానందసాగరంలో తేలుస్తూన్న నామనోహరి, నేటికి ఆటోపీవాని మనోహరి—అంతలో నాకండ్లు గిర్రున తిరిగి పోయినవి. అట్టే దిండు మీదికొరిగి పోయినాను. లోకంమరచి పోయినాను. ఎప్పుడువచ్చిందో మను, నాకు తెలియలేదు. నన్ను లేపింది. గడియారం పదకొండు కొట్టింది.

"ప్రొద్దున పదిగంటలకు తిన్నఅన్నం, మధ్యాన్నం కూడా ఫలహారమేమీ పుచ్చుకోలేదు, రాత్రి రెండు ఝాములైనవి. రెండు మెతుకులు మిరియాలచారులో కలిపి యివ్వనా? ఇట్లా గంటే శోష వస్తుందేమో!" అని అన్నది మను. అప్పటి ఆమె ప్రేమ, దయా, జాలీ, పూర్వమెప్పుడో నేను కల్లో అనుభవించినట్లు నాకు తోచింది. మొదటినుంచీ యింతే, ఇంకా యింతెంతో యెక్కువే! కాని, యిప్పటి యివన్నీ వగలు! ఆస్థితిలోనే నాకు నవ్వువచ్చింది! మనూ నన్నోరగంట చూచింది! తిరస్కారంగా నవ్వినాననుకున్నదేమో! తల వాల్చింది!

"పలుకరేం! చారులో అన్నం కలిపి యివ్వనా?" అని తిరిగి అన్నది మను.

"ఊహూఁ!"

"బార్లీ జావ కాచి యివ్వనా?"

"ఊహూఁ!"

"లంఘనముంటారా?"

"ఊఁ!"

"శోష వస్తుందేమో, ఇంత పాలైనా—"

"నాకేమీ అక్కరలేదు. నన్నూరికే బాధించవద్దు!" అని నేను కసిరాను.

అప్పుడామె కండ్లనుండా ముత్యాలు రాలినవి. మెల్లగ నాపక్కనుంచి లేచి వెళ్లిపోయింది. వెంటనే తలుపులన్నీ మూసిన చప్పుడు వినబడ్డది! తాను భోజనం చేయందే తలుపు లన్నిమూస్తూన్నదే!—వెంటనే వచ్చి కూర్చుంది నాపక్కన! నేను మొగ మావలికై పునకు తిప్పుకున్నాను. మను నాకాళ్లొత్త నారంభించింది. కాళ్లు తప్పించుకున్నాను. అట్టే కూర్చుంది. ఎంతసేపు కూర్చుందో నాకూ తెలియదు. నాలోకంలోనేనుండి పోయినాను.

మను నన్ను నిద్రలేపింది. కండ్లు తెరచాను. సూర్యుడు తన కిరణాల్ని మాగదికిటికీ గుండా పంపి నన్ను తట్టి లేపుతున్నాడు.

"చాలా యెండెక్కింది. కాఫీ చల్లారిపోతూంది. వేడివేడిగా ఒక్క కప్పుపుచ్చుకుంటే—"

లేచాను దంతధావనమయింది. కాఫీ గుటక వేశాను కాని, కాఫీ రుచిగా ఉండ లేదు.

"మొఖం చిట్లిస్తూన్నారు. కాఫీ చల్లారిందా?"

"ఊహూఁ!"

"బాగుండ లేదా?"

"ఊఁ!"

"పైత్యం చేసిందేమో?" అన్నది మను.

కాని, నేడు కాఫీ రుచిగా వుండకపోవడం దేనికి? ఎప్పుడూచేసే చేతులే నేడుచేసినవి. ఎప్పుడూ యిచ్చే చేతులే నేడు యిచ్చినవి. కాని, కాఫీలో మాత్రం యెప్పుడూవుండే రుచి నేడు లేదు. విషప్రాయంగావుంది! ఎట్లాగైతేనేమి. ఏదిలేకపోయిన వుండగలను గాని, కాఫీ లేకుండ నేనొక్కక్షణ ముండలేను ఒక్క గుక్కన తాగేశాను, కషాయంతాగినట్లు! పడుక కుర్చీలో పడ్డాను.

"సిగరెట్ కావాలీ? ఎందుకూ? ఇది మా నేద్దురూ" అన్నది మనూ 'సిజర్సు' ఒకటి నాకు చూపుతూ.

'సిజ'ర్సొకటి ముట్టించాను. ఆలోచనలో మునిగాను. పావుగంటలో మను నాదగ్గరకువచ్చి పక్కన కుర్చీలో కూర్చుంది. నాపొట్టమీద చెయిపెట్టి చూచింది.

"కొంచెంగా తగ్గిందికాదూ జ్వరం?"

నేనా మొహం కేసిచూచాను. చిరునవ్వు నవ్వింది మను.

"పలకరూ ? అయాసంగా ఉందా ? పలకనివ్వటంలేదా ? నిన్నటినుంచీ నాతో మాట్లాడలేదు. జ్వరం తగిలింది కదా, ఆయాసంగా ఉందేమో అనుకున్నాను. ఇప్పుడు కొంచెం తగ్గిందిగా! యిప్పుడూ పలుకరూ? పావుగంట, మాట్లాడుతూందాము. వంట త్వరగా చేయాలికాదా ! ఈవేళ కోర్టుకు వెళ్లడమెట్లు ? పోకుకాద్దు! వద్దు. శరీరం బాగుంటేనే అన్నీ ! 'లీవ్ లెటర్' వ్రాసి పంపుదురూ!"

"వగలు! నేను కోర్టుకు పోతానో లేదో తెలిసికోవడానికీ పన్నుగడ! పోతే పిలిపించుకోవచ్చును. పోనంటే పెందలాడే రావద్దని కబురుపంపవచ్చును! వగలమారి! ఎంత గడుసుతనం! నా కివన్నీ కొత్తలుకావు. కాని యిప్పుడన్నీ కొత్తలే ! విపరీతాలే! వగలే ! విచిత్రాలే!" అని యింక నేమేమో నాలో నేనాలోచిస్తూన్నాను.

మను మళ్లీ యిట్లన్నది: "ఈలా పలక్కుంటే నాకేమీతోచటంలేదు. నేనేమనుకోవాలె? ఒంట్లో ఫలానిజబ్బుగా వుందని చెప్పితేనా? ఒంటరిదాన్ని, నాకేమి తోస్తుంది? పలకరూ?"

నేను పలక తలచుకొని వుండలేదు. కండ్లుమూసికున్నాను. మళ్లీ నావిచారంలో మునిగి పోయినాను.

"అడుగనా? ఏమనుకుంటుందో! ఆటోపి యెక్కడదాచిందో? అడగనా? చెప్పనా? ఇంట్లో దాచివుంటుందా? అమాత్రం ఆలోచన మనూకూ తోచకుంటుందా? ఇంట్లో దాచితే చిక్కుతానేమో అని భయం లేకుంటుందా ? ఇంట్లో దాచలేదు, నిశ్చయం. కాని, ఆటోపీయేమిటో, అది యెవరిదో, వ్వాడెందుకువచ్చాడో అడిగి అనుమానం పరిష్కారం చేసుకుంటే నయం. కాని చెపుతుందా? నిజం ఒప్పుకుంటుందా? ఒప్పుకొనకపోతే మరి టోపీ సంగతియేమి? నాకండ్లతో చూచానే. ఒప్పుకోక పోతేమాత్రం నమ్ముతానా ! నిజం చెప్పేవరకు మానుతానా! చెప్పేతీరవలెను గాని, దాచ శక్యమా ! చెప్పితే, నేరం ఒప్పుకుంటే, తన అధఃపతన చరిత్రం తన నోటిగుండా మనూ చెపుతూండగా ఈచెవులతో నేనూ వినవలసిందే! ఛీఛీ! దుర్భరం, అసహ్యం! పడలేనీబాధ. అంతకంటే వురిపోసికుని చస్తేనే మేలు! కాని, యీలాటి అనుమానాలచేత బాధపడడంకంటే ఒక్కసారే యేదో ఒకటి తేలుతుంది కదా! అడుగుతాను. కాని, అట్లయి వుంటుందా ! నామను ఇంతటి విశ్వాసఘాతుకపు పనిచేసి వుంటుందా ? నన్నుగాదని యింకొక్కనికి తనప్రేమ—నాయందలి ప్రేమలోభాగం—ఇచ్చి వుంటుందా? ఇంతటి నీచానికి పాల్పడి వుంటుందా? ఏమో! అయినా, అడిగితే మంచిదే! ఏదొఒకటి తేలితే మంచిది."

అని నాలో అనుకున్నాను. ఇటు మొగమైనాను.

"మనూ,"

మను చిరునవ్వు నవ్వింది, అందులోనూ విషాదం కలిసేవుంది. దుఃఖం కలిసేవుంది. కాని, నవ్వుమాత్రం అరువు తెచ్చుకుందని స్పష్టంగా కనబడ్డది. ఎప్పటి ఆ చిరునవ్వు మొహం నేనెరుగనా? ఎప్పటి నవ్వుకాదు; ఆమోముపైన యెప్పటి కళా లేదు.

"ఏమిటి?" అన్నది మను.

ఊరుకున్నాను. ఆలోచనలో పడ్డాను.

"ఏమనుకుంటుందో! నన్నెంతటి వాణ్ణిగా భావిస్తుందో! కేవలం మూర్ఖుణ్ణి అంటుందేమో! పట్టి అనుమానపు మనుష్యుడంటుందేమో! అంతేమాత్రం అయితే నయమే! తనపై నేరం మోపినానని, తన నడతనుగూర్చి, పాతివ్రత్యమును గూర్చి, శంకిస్తున్నానని, భరించలేక, రొంపిలోనే నాపడి—ఆలాగైనా కొంతమేలే! ఈలాటి విశ్వాసఘాతకురాలు, ఈలాటి వగలమారి పిశాచి; ప్రపంచానికి బరువు—స్త్రీలోకానికి అపకీర్తి—నాకు తలవంపులు."

నాకు మళ్లీ తలనొప్పి సాగింది. నాతల బద్దలై పగిలి పోతుందేమో అని తోచింది. అదీ సమాధానమే. తల బద్దలైతే ప్రాణం పోతుంది. ప్రాణంపోతే ఈఅనుమానం వదులుతుంది! కాని, కాలేదు. మనూ నాయెదట వుండడం నాకిష్టం లేదు.

"వంట పని యేమీ లేదా? ఈలాకూర్చున్నావు?" అన్నాను నేను.

"ఇక్కడ ఈలాగుంటే నాకేపని తోస్తుంది? వంట యెంతసేపు కావాలి?"

రాత్రిభోజనం లేదు. ఎండెక్కుతోంది. ఇంతవరకూ వంటపనికి మొదలుపెట్టలేదు. అనుమానంవల్ల, కోపంచేత, అసూయతో, నాపొట్ట నిండేవుంది. ఆకలి వేయడం లేదు. మనూకో? రాత్రీభోజనం లేదు. నాపాదాలకడ వాలి నిద్రపోయిందికదా! నాకు జాలి పుట్టింది.

"మనూ, వంటపనికి ప్రారంభించు" అన్నాను.

"వంట యేంచేయను? ఏది సహిస్తుందో చెపితే వండుతాను." అని మను మహాదరంతో నన్నది.

నే నూరకున్నాను.

"ఏమి కూర వండనూ?"

"ఏదో ఒకటి వండుమూ!"

మను లేచి తొందర తొందరగా నడిచి పోయింది. తిరిగి వచ్చింది.

"ఒంటరిగ వుంటారా? కుర్చీ వంటయింటో వేస్తాను.అక్కడ కూర్చుంటే మాట్లాడుతూ వండుతాను. ఇక్కడ వొంటరిగా వుంటే అక్కడ నాకేమీ తోచదు. మాటిమాటికీ యిక్కడికి పర్గా మంటే వంట..."

"అక్కరలేదు. వంటత్వరగాచేసి వచ్చి చెప్పు."

మను వెళ్లి పోయింది. తిరిగీ నాలోకంలోనే మునిగిపోయినాను. ఎంత ఆలోచించుకున్నను అనుమాన పిశాచం నన్ను వదలింది కాదు. మను నాదగ్గర ఉన్నంతసేపు—అదికి నాఅనుమానం పరిహాసాస్పదం చేసుకుంటాననుకుంటాను. మను నాయెదుటికి రాగానే అంతా మరచిపోదును. నాటు నాలోనే గాదు. ఆలోచనలన్నీ బాధ, ఆలోచనలన్నీ కుర్చీలో రగులుతూ? దబ్బుబ్బు; ఆబాధ నాకే తెలుసును. ఆ పని పిశాచానికే తెలుసను.

ఈ విధంగా వారం రోజులు గడిచాయి. దినం తిగా మనూను పలకరించ లేదు. ఆమె ముఖం యెప్పుడు చూచినా విచారం తోనే వుండేది. తన దొంగతనం నాకు తెలిసినందుకు లోలోపలనే కుములుతూన్నదేమో! ఆపిశాచికే తెలియవలె.

నాకు జ్వరం నిమ్మళించింది కాని, నన్ను పట్టి పీడిస్తూన్న పిశాచంమాత్రం నన్ను వదిలిందికాదు. మరింత తీవ్రంగానె పీడించ సాగింది. నేననేకవిధాల నామనసును సమాధాన పరచుకొన యత్నించాను.

"మను ఇంతటి విశ్వాసఘాతకురాలేనా! నా మను ఇట్టి తుచ్ఛపు పనికి లోంగునా? ఎవరైనా నమ్ముదురా? బ్యాంకు దివాలాలో నాపూర్వార్జితం సొమ్మంతా పోగా నేను విచారిస్తూంటే, నాప్రక్కలో కూర్చుండి, నాభుజాన తన తలనొర్గి, నాకంఠాన్ని తన రెండుచేతులా పెనవేసికొని, చిఱునవ్వు మొహాన చిందులాడుతుండగా నన్నెంతగా ఓదార్చింది! "ఇంత మాత్రానికే యింత విచారం దేనికి? ఒక్కనాడు విచారరేఖలో వుండడంతోనే శరీరం జబ్బుచేసి నానాబాధలూ కలిగి శరీరంపాడై పోతుంది కదా! మళ్లీ నెలరోజుల దాకా మనుష్యులలో కలవరు కదా!, ఇంత మాత్రానికే యెంతకాలం విచారిస్తూంటారు! వెధవడబ్బు! డబ్బును మనం సంపాదించామా, డబ్బు మనల్ని సంపాదించిందా? పోతే మానె, వెధవడబ్బు! ఉన్నప్పటినుంచీ భయమే, విచారమే. ఉన్నవాళ్లకంటే లేనివాళ్లే యెక్కువ సుఖపడ

తారు. చూడండీ! బ్యాంకులో డబ్బు పోయిందంటే, అన్నీ పోయినవా? నావంటిమీది నగలున్నవి కదా? అవీ పోయినా మానె? శరీరం కులాసాగా ఉంటే యెంత సంపాదించ లేరు! పోయినంతా సంపాదించలే మనుకోండి. మనకు ముఖ్యంగా కావలసినంతమాత్రం సంపాదించలేరా! అందులోనే మితంగా వాడుతూ నెలకేదో కొంత వెనక వేసుకుంటే అదేచాలును. పైగా యింకా యెన్ని లాభా లున్నవో చూడండీ! వంటవాళ్లతో పని లేదు. నేనే నాచేత్తో నైనట్లే వండిపెడతాను. మీకు సకలమైన ఉపచారాలూ చేస్తాను. ఇప్పుడు నన్ను సుకుమారిగా చూస్తో పెట్టి వున్నారు. అన్ని పనులకూ నౌకర్లున్నారు. అందరితోనూ అవసరం లేదు. అన్నిటికి నేనున్నాను గదా! ఈ విధాలా నైనా మీపాదసేవ చేసే పుణ్యం, భాగ్యం, సంతోషం, నాకు కలుగుతుంది ఇంత పెద్దిల్లు మన కెందుకు? అద్దె కిచ్చివేసి మనకు సరిపోయే చిన్నయిల్లొకటి మన మద్దెను పుచ్చుకుందాము. ఇల్లు శుభ్రంగా ఉంచి ముందరి భాగంలో సీమపూల మొక్కలూ, నాటు పూలచెట్లూ వాటి నేనే నీళ్లు పోసి పెంచుతాను. గులాబీమొక్కలు నాప్రాణం కదా! వెనుక దొడ్డిలో కూరతోట వేసి పెంచుతాను. కూరలకు పనికి వస్తవి. అప్పటికీ యిప్పటి సంపాదన చాలక పోతే, ఉన్నవి కదా నావంటి మీది నగలు! కాలక్షేపం చేయలేమా! ముఖం తెలవెలా తేల? నగలు పోతవని విచారమా! అందరూ నగలు పెట్టుకొన్నవారే ఉన్నారా? నగలైనా దేనికి! ఈలాటి చిక్కులకు పనికి రావడానికేనా? పోనిండీ. నా కావిచారం లేదు. సింగారించుకొనే దాన్ని నేను. నేనే నా మనస్పూర నానగలన్నిటిని మీ స్వాధీనం చేస్తున్నాను. ఇంక మానవచ్చు మీ విచారం. ఒక్క నవ్వు నవ్వుదురూ! నేను చూడలే నీవిచారం. సంతోషంతో వుందురూ! డబ్బు సంపాదించడానికి ఒంట్లో బలం వున్నది. విద్యావున్నది. కావలసినంత వుపచారం చేయడానికి నేనువ్వాను. ఇంకా విచారమెందుకూ? లేచి "టీ" పుచ్చుకొందురూ! చల్లగ చల్లారి పోతూంది" అని యింకా పరిపరివిధాలా నాదుఃఖ మంతా పోగొట్టి నన్ను సమాధానపరచిన ఆమనూకా యీ దుర్బుద్ధి?

ఆ పెద్ద యిల్లు విడిచి మేమీ యింటికి వచ్చినప్పటినించినీ సకలమైన వుపచారాలు చేస్తూ నన్ను సుఖపెట్టుతూన్న ఆమనూకా యీ దుర్బుద్ధి? ఇది నమ్మవచ్చునా? ఏమో! ఎందుకునమ్మకూడదు? అప్పుడూ నావద్ద పుష్కలంగా ధన ముండేది. ఆవిడ ఒంటిమీద కావలసినన్ని నగలుండేవి. ఇప్పుడు డబ్బు పోయి పేదవాణ్ణి అయినాను. నగలలో కొన్ని అమ్మేసినాను. కాబట్టి యీ దుర్బుద్ధి ఆవిడకు ఇప్పుడు పుట్టివుండకూడదా? ఛీ! ఛీ! అట్లవునా? నామనూ నే నెఱుగనా? ఇంతకాలం నుంచీ యెంతో ప్రేమతో వుండిన మను యిప్పుడు దరిద్రుడైనానని తన శీలం విక్రయిస్తుందీ డబ్బుకోసం? నమ్మవచ్చునా? నమ్మకపోవడాని కాధార మేది? స్త్రీలమనసులోతు బ్రహ్మదేవుడికైనా తెలియదట. ఇంక నాబోటి వారికెట్లా తెలుస్తుంది? అటుగాక పోతే అన్ని పురాణాల్లోనూ యెందు కిదే మాట యేకరు పెట్టాలె?

ఛీఛీ! నిరర్థక మీ జన్మ. నిష్ప్రయోజన మీ బతుకు.

ఈవిధంగా యింకా నానావిధాలా ఆలోచనలో తర్క వితర్కాల్లో మునిగాను. ఆలోచనకు అంతు లేదు. అనుమానం పుట్టనే కూడదు. పుట్టిందా పెద్ద పిశాచం. పట్టినట్టే వదిలించుకోవడం బ్రహ్మతరం కాదూ? అందులో ముఖ్యంగా భార్య నడత విషయం అనుమానం బ్రహ్మరాక్షసి పట్టినట్లే. నా మనూమీద నాకెప్పుడు నేలాటి యనుమానం కలగలేదు. సరళమనస్క—విశాల హృదయ—దయామయి. అన్నీ బాగానేవున్నవి. కాని, యిప్పుడు కలిగిందనుమానము. వదిలించుకోవడ మేలాగా? పట్టి పీడిస్తూన్నది. నా మనసులోనున్నది ఇది అని మనూకెట్లా తెలుస్తుంది? ఈ నెల రోజులనుంచీ చూస్తూ వున్నాను. ప్రతి విషయంకూడా పరీక్షిస్తునే వున్నాను. నడతలో అనుమానం సరేకదా! నడకలో అనుమానం, కన్నీటిలో అనుమానం, మాటలలో అనుమానం, ఆచూపులలో అనుమానం, నాయెదుటవస్తే అనుమానం, చాటున వుంటే అనుమానం, అన్నీ అనుమానాలే! ఎన్ని విధాలింకా పరీక్షించవచ్చును? ఎంత కనిపెట్టితే మాత్రమేమి? కన్నులు కప్పివేయ లేదూ? మూతి తిగించివేయ లేదా?

పోనీ, అడుగనా? అనుమానం తీర్చుకొందునా? నిజం చెప్పుతుందా? నేర మొప్పు కుంటుందా? పైగా అనుమానించానని యెందులో నైనా పడి చస్తే? అప రాధం నాకే! ఛీ!ఛీ! ఇంకా చూదాం; ఇంకా చూదాం.

అని నానాటికీ నేను కృశించిపోతూ వున్నాను. మనస్సులోని వేదన మనస్సుకే తెలుసును. మనసులో నిలకడ లేదు. బుద్ధి పాడై పోయింది! మెదడు బరువయింది. బలం క్షీణించింది. చిక్కి శల్యమై పోయినాను. మంచంమీదినుంచి లేవ లేక పోయినాను. మనూ మహాశ్రద్ధతో నాకుపచారాలు చేసేది. కాని, ఆవుపచారాలు నాకింపుగా ఉండేదికాదు. చేయి నాకు సోకితే ముండ్లకంపగా తోచేది. మాట్లాడితే వెగటుగా తోచేది. ఎదురు వస్తే పెద్దసర్పాన్ని చూచి నట్లయ్యేది. చాటుకు వెళ్లిపోతే అనుమానం. ఈలా వున్నది నాస్థితి.

నేను వద్దన్నావినక మను డాక్టర్ని పిలిపించింది. ఆయన నన్ను పరీక్షించాడు. రోగం ఫలానిదని నిర్ణయించలేక పోయినాడు. ఏదో ఒక మందిచ్చాడు. నా రోగం సంగతి డాక్టరు కేలా తెలుస్తుంది? దగ్గర వున్న మనూకే తెలియదు. చేయి పట్టిచూస్తే తెలుస్తుందా! మందిస్తూన్నాడు. నేనూ పుచ్చుకుంటూన్నాను. వ్యాధి కుదరదు. కొంతకాలం గడిచింది! మందు ఒంట పట్ట లేదు. ఏలా పట్టు తుంది? రోగ మొకటైతే మందు వేరొకటి! తెలియకనే అన్నారా 'మనోవ్యాధికి మందు లేదు!' అని! మరీ వాడిపోయినాను. కండ్లు గుంటలు పడ్డవి. బుగ్గలు సొట్ట పడ్డవి. నారూపమంతా మారిపోయింది! వికారాకారం దాల్చాను. పలకలేను. చేతులు కదిలించలేను. అన్నహితవు తప్పింది! నాస్థితి నాకే తెలియాలి! ఆదేవుడికే తెలియాలె! ఒక్క నెలరోజుల్లోనే నేను జీవచ్ఛవ మైపోయినాను.

ఈమధ్య ఒకటి రెండు మార్లు నిద్రాదేవి నన్ను కదిలించింది. కాని, నాలోపల వున్న అనుమానపిశాచం ఆమెకు నన్ను లొంగ నిచ్చింది కాదు. నిద్రాదేవి నా పిశాచాన్ని వదిలించడానికి ప్రయత్నించింది. కాని, సవతిమచ్చర మెక్కడికి పోతుంది? ఇద్దరూ పోట్లాడినారు. ఒకనాడు నిద్రాదేవి నన్ను ఆవహించింది. ఎంత సేపామె అధీనంలో వున్నానో నాకు తెలియలేదు.

ఉన్నట్లుండి నా మొహం మీద నీళ్ల చుక్కలు నాలుగైదు పడ్డవి. కండ్లు తెరచి చూచాను. మనూముఖం ఆవలికి తిప్పింది. నాతలవేపున కూర్చుండి నా తల పిసుకు తూన్నది. పైటచెరగుతో కండ్లు తుడిచికొన్నది. నాకు మహాకోపం వచ్చింది! "మాయ" అన్నాను కోపం పట్టలేక. నాతలమీదనున్న చేయి విసరేశాను.

"నిద్రాభంగ మయిందా! క్షమించండి. పాపిష్ఠురాలిని!" అని మను మనస్సు నొచ్చుకుంటూ దైన్యంతో అన్నది. కండ్లు కన్నీరు కారుస్తున్నవి. నేను చూడ లేక పోయినాను!

"మాయ"! అన్నాను మళ్లీ.

"ఏమి మాయ! ఎందు కిట్లా కసురుతారు? బాధ అవుతుందా? నన్ను కాళ్లు పట్టనీయరు, తల ఒత్తనీయరు, నన్ను మాటవరసం తోనే మొహం వారల తిప్పుతుంటారు. నేను దగ్గరవుండడం కిట్టలేదా? ధుమధుమ లాడుతారు, విసుక్కుంటారు, కండ్లు చూసుకుంటారు. ఎప్పుడూ ఇట్లుండలేదే! నాచేతులూ తగలనీయడంలేదు. నేనేమి చేయబోయినా మీకింపుగా వుండడంలేదు! కారణ మేమిటో? నేనేమిచేశాను? మీకు మనసుకురాని పని నేనేమి చేశాను! నన్నెందుకు కసురుతారు? మీకు నేను భారంగా తోచానా? నా సేవలు మీకు ప్రియించ డంలేదా? చెప్పండయ్యా, నేను చేసిన అపరాధమేమిటో! ఇన్నాళ్లుచూశాను. ఓర్చుకోలేక ఓప్పుకోలేక ఓగుస్తూన్నాను. ఈకసురులు, ఈనిరాదరణ, ఈకోపంతోటి చూపులు, ఈవెడమొగం, ఈవిసి, ఇంకా ఏమి కావాలె? డాక్టర్లు జబ్బేమీ లేదంటారు. మందు ఒంట బట్టలేదాయె. డాక్టర్లకు తెలియనిజబ్బు—నాకు తెలియని జబ్బు—కడకు మీకూ తెలియని జబ్బు—అజబ్బేమిటి! ఆలోచిస్తే యేదో మనోవ్యాధి మిమ్మట్టి పీడిస్తూన్నట్లున్నది. కాకపోతే యింతలోనె యిట్లవుతారా? చిక్కి శల్యమై పోయినారే? ఎందుకు వచ్చిన జబ్బు! మీ మనోరోగాని కేదో కారణముండాలెకదా.

"నీవే" అన్నాను. తటాలున నోరు జారింది.

"నేనా? నేనా? నేనేనా మీ మనోవ్యాధికి కారకురాలిని? నేనేనా మీ యీ దుర్దశకు కారకురాలిని? అయ్యో; చెప్పరైతిరే! ఈమాట వినీకూడా నాప్రాణా

లు లేచిపోవే! నెత్తిమీద నా పెద్దపిడుగు పడరాదా! ఈమాట వినలేను; ఈనింద భరించలేను; ఈపరాభవం సహించలేను. అయ్యో అప్పుడే చెప్పివుండరాదా? వుండరాదా? తన ప్రాణాలకంటెను ప్రాణంగా, తనకంటి రెప్పలకూ రెప్పలుగా, నన్ను రక్షిస్తున్న మీ కింతటి దైన్యం—ఇంతటి దుఃఖః—కలిగించి, యింకను ప్రాణా లుపట్టుకొని వున్నానే! ఎంతటి పాపిష్ఠురాలిని! మీ చేతులతో నన్ను చంపండి! ఈమాటన కోర్చలేను. ఈబాధను అనుభవించలేను." అని అంటూ మహాదుఃఖముతో మను తూలి నామీద పడ్డది:

"ఛీ, దురత్మగ్రురాలా; నీముఖం చూడవచ్చునటే! ఎంతటి వగలాడివే! నీవు నాకు భార్యవేనా? ఎందు కీవగలు? ఇంతకాలంనుండి అట్లే అనుకొని నమ్మాను. నీమాయమాటలకు లొంగాను. నీ కపట ప్రేమపాశంలో చిక్కుపడ్డాను. నీరూపదీపానికి శలభమైనాను. వగలమారీ, బంగారుపూలబొమ్మ వనుకుని భ్రాంతితో చేత పట్టుకున్నాను. అది అకస్మాత్తుగా లోకలిసి మాయమై పోయింది. పూలచెండు అని తలచి మెడలో తగిలించికున్నాను. నాగుబాము మెడకరిచి విషం ఎక్కింది. నీళ్లు అని భ్రమిసి దిగాను. ఊబిలో దిగబడ్డాను! వానచినుకు అనుకుని ఆత్రంతో నోరు తెరిచాను. పెద్ద పిడుగు అయింది! నీమరాలా! నీమాయలోన నా పేరు మాసింది! ఆనాడు, మన డబ్బంతా బ్యాంకులో దివాలా కాగా, అందుకు నేనుదుఃఖిస్తూంటే... ఇంకా బతికియేందుకని నేను చావసిద్ధమైతే, అప్పుడు— అప్పుడు—నీవు, వగలమారి! నీవు, నన్నెంతగా సమాధానం చేసినావే! ఎంతగా దుఃఖాన్ని చల్లార్చినావే! వదులుకుందు నిశ్చయించుకున్న నాప్రాణంమీద తీపి నాకెంతగా తిరిగి పుట్టించినావే! మనూ! అమనూ నీవేనా, నీవేనా! మనూ, మనూ! నన్నెంతగా మోసపుచ్చావే! నేను నీభావం తెలియక యింటిలో నీవుపన్నినవురిలో తగులుకున్నానే! అన్నిటా, మీకు కావలసిన వుపచారాలు చేయడానికి, నేను న్నానంటివే! నాకవ డబ్బు పోయినందుకు ఇంత విచార మెందుకంటివే! ఎంతో ప్రేమ వూడిపడినట్లు నటిస్తివే, తెలిసింది; నీవగలు! ఛీ! ఛీ! నీమొహం చూస్తేనే పాతకం చుట్టుకుంటుంది. ఛీ!ఛీ! దురాత్మగ్రురాలా!—" ఇంక మాట్లాడలేక పోయినాను. ఆవేశం

పెరిగింది. అశక్తుడనై పోయినాను, నాలుక యెండబారింది. గుండె దబదబ లాడింది. వడవడపోయినాను. కన్నులు మూతలు పడ్డవి. మను యేమీ మాట్లాడలేదు. శాంతభావంతో నా నా మొహం మీదనే తన చూపులు నిలిపింది. కాని, ఆకండ్లలో గంగాయమునాసంగమం అయి మహావేగంతో ప్రవహిస్తూన్నది. ఉస్సుమని నిట్టూర్పులు మాత్రం వినబడుతూన్నవి.

ఎంత సేపటికో, నాకు తెలియదు, కాని, కండ్లు తెరిచాను. మను నాపాదాలపైన మొహం పెట్టుకుని పడి వుంది. ఒక చేతితో విసనకర్రపట్టుకుని నాకు విసురుతూన్నది. నేను కండ్లు తెరిచానని తెలియలేదు. ఏమో అనుకుంటూంది. వినబుద్ధి పుట్టిందినాకు. కండ్లు తిరిగీ మూశాను.

"ఎన్నడూ అన లేదే! నేడేమి నాకర్మమా! ఎంతతిట్టినా ఎంతకొట్టినా, చంపినా, ఓరుస్తాను! గాని, భార్యను కానా? వగలమారినా? విశ్వాసఘాతకురాలినా? అయ్యో! అపనింద, దయామయుడా! పరమేశ్వరుడా! ఇట్లా నన్ను పరీక్షిస్తావా? ఈమాపణ చాలదా! మగని చేతనే పరాభవమా? అంతకంటే చావు మేలు! ఎందుకిట్లా నన్ను అనుమానించారో?"

"తెలిసింది, నీవగలు." అని తటాలున నేనన్నాను.

మను లేచింది. నాకు కొంచె మెడంగా నిలిచింది. దేహమంతా గజగజ వణుకు తూంది, కన్ను లెర్రపడ్డవి. భయంకరాకారం దాల్చింది మను. అప్పుడు నాకు కరాళరూపమూర్తి మహిషాసురమర్దనీరూపం జ్ఞాపకం వచ్చింది. ఏదో శక్తి నన్ను మింగవచ్చిం దనుకున్నాను.

"నేను భార్యను కానా? నన్నట్లు ఎందు కనవలసివచ్చింది? నేనేమి ద్రోహం చేశాను? ఆవిధంగా నేను విశ్వాసఘాతుకురాలినని అనుమానించడానికి నిదర్శనమేదీ? కారణముండవలెకాదా? రుజువు పరచవలె, నిజం కనుక్కోవలె. తప్పుంటే శిక్షించాలె! అన్యాయం లోలోపలనే కుళ్ళడ మెందుకు? అడగాలె, నేరముంటే చంపాలె. నాయేనడత మీకు సహ్యమైంది? నేను మిమ్మెట్లా మోసపుచ్చాను? నానేర మేమిటో నా నెత్తికి చుట్టాలె. ఇంతవరకూ ఓర్చుకున్నాను. ఇంకానోను.

మీ మనసులో వున్నదేమిటో బయటికి రావాలె. కాకపోతే నే నుఱ్యోగొయ్యో—!"

"అదీమేలే! అదే మంచిది. ఇంతటి వగలమారి బతికివుండి యితరుల పరువును బూడిద పాలుచేసి, కొంపలు కూల్చడంకంటే—అప్రతిష్ఠ. నెత్తికిచుట్టి, తానూ చుట్టుకోవడంకంటే—చావే మంచిది. ఇంతటి విశ్వాసఘాతుకురాలికి బలవంతపు చావు కాక మంచి చావెప్పటికిని రాదు. చేసినచేత లేలాటివి? నన్ను పెట్టిన బాధలెంతటివి! బాధకుబాధ—నన్ను బాధించినంత బాధా—వడ్డీతో యింకా అంతబాధా—అనుభవించాలె"

"కానిండి, నా నేరం నాకప్ప జెప్పండీ! నాతప్పేమిటో?

"మాయలాడీ! ఇంకా యీవగ లెందుకూ? ఇంక దాచుతా వెందుకూ? నీ తప్పు నీ వెరుగనట్లూ నటిస్తావు!"

"లేదు, ఎరగను, నా నేరం నే నెరగను. తమ తప్పులు తా మెరిగి తెల్లితే లోక మెందు కింతపాడవుతుంది? చెప్పండీ, నా తప్పు లేమిటో?"

"ఆహాహా! ఎందుకీజన్మ—పాడుజన్మ—భార్యయింకొకని కోరిందని లోకు లందరూ ఛీ-ఛూ, అని మొహాన్ని మేస్తూంటే—కడుపు కండ్లార చూచీసూ గా—ఈ ప్రాణాలు—మొండిపడి పోకున్నవే? ఎందుకీ మొండి బతుకు!" అని అంటూ నేను నాతల పగలకొట్టుకున యత్నించాను. మను నన్నా పనిచేయనీయక ఆపింది. నన్ను పట్టుకుంది.

"ఏమి మీ కండ్లార చూచారు? నే నితరునితో మాట్లాడుటగా? ఏమి చూచారు? ఎవరేమి చెప్పారు? ఎవరిని, ఛీ-ఛూ, అంటారు? ఎందుకు? ఎవరిని చూచారు? అప్పుడే పట్టుకోవలసి వుండె. ఒక్క దెబ్బతో యిద్దర్నీ నరకవలసి వుండె. ఆవాడెవడు? ఎవడువాడు? ఎవడిని చూచారు? చెప్పండీ, ఇంక దాచీ లాభం లేదు."

"టోపీ—"

"ఏటోపీ వానిని? ఎప్పుడు?

"నాకు జ్వరం తగిలి కోర్టులో హార్పేలేక యింటికి మధ్యాన్నం వచ్చిన నాడు."

"చూచారా? స్వయంగా చూచారా?

"ఆఁ. చూచాను. విను; ఇంకా దాచడ మెందుకు? కుండ బద్దలు చేస్తాను. ప్రాణం పైకెగిరి పోతూంది. అయ్యో పట్టుకో, నన్ను పట్టుకో, అది కాస్తా చెప్పిపోతాను, ఇంక ప్రాణాలు భరించలేను. నాలుక పిడచ పడ్డది. కొంచెం నీళ్లు—వద్దు. అపవిత్రం అయిన నీచేతితో వద్దు."

మను గ్లాసుపట్టుకొచ్చింది. 'వద్దు' న్నాను. 'నీళ్లు కాదు పా'లన్నది గ్లాసు చేత బట్టి పోయినాను. చేతులు వణుకుతూన్నవి. గిన్నె పట్టుకో లేక పోయినాను. దిండుపై వొరిగాను. మను ఆపాలు కాస్తా నానోట్లో పోసింది. పది నిముషా లూరుకున్నాను. మనూ వుంపూంచూచాను. ఏమో ఆలోచిస్తూంది. కాని, మొహాన వికారం కనబడ లేదు. వికారం కనబడ లేదు. నిష్కపటంగా కనబడుతూంది—కొద్దిగా దుఃఖం మాత్రం కనబడుతూంది. వగలు—నటన! ఇంత నేర్చింది అంత నేర్చివుండదూ? నేను నేర్చిం ది దాచ నేర్చిందా?

"విను, ఆనాడు, కోర్టులో నాకు జ్వరం తగిలింది. హార్పే లేక పోయినాను. ఇంటికి వచ్చాను. తలవాకిలి మూసివుంది. తట్టాను, పిలిచాను పది పిలుపులకూ జవాబు లేదు. ఎండ—జ్వరం—నిలవలేను. ఎట్లాగో అర్ధ ఘుంట ఆలస్యంగా తలుపు తెరచావు; నన్ను చూచావు; నీమొహం వెలవెలబారింది; గాభరా పడ్డావు! నన్ను ముందుగా పోనీక నీవే నన్ను తోసికుని ముందుగా యింట్లోకి వెళ్లావు. నీగదితలుపు మూశావు. నాగదిలోకి వెళ్లాను. డ్రెస్సుతీశాను. పరున్నాను. మనసుకు నచ్చ లేదు పడకకుదర లేదు. నీవూ దగ్గర లేవు. నన్ను పలకరించ లేదు. నాకేమీ తోచలేదు. ఒంటరిగావుండ లేక నీవు నీగదిలో వుంటావేమో అని అనుకుని అక్కడ పరుందామని వెళ్లాను. చూచాను—బల్లమీద జరీబుతేదారీ పనిచేసిన చక్కనిటోపీ చూచాను.

"ఎవరి దా టోపీ"

'ఎవరి దాటోపీ! అక్కడి కెందుకు వచ్చింది? నేనింటికి వచ్చినప్పుడు ఎంత పిలిచినా తలుపు తీయవైతి వెందుకు? ఆటోపీవా డుండబట్టే.'

"ఏటోపీవాడు? ఎవరా టోపీ వాడు?"

"ఆబల్లమీద వుండినటోపీని పెట్టుకునేవాడు— ఎవడో? తలుపు ఆలస్యంగా తీసిన కారణ మేమిటి? వాణ్ణి దిడ్డిదోవను సాగనంపి రావడానికి.

"ఆఁ—తెలిసింది."

"విను, పూర్తిగా విను. అడ్డు మాట్లాడకు. తలుపు తెరచిన తోటే నీముఖం వెలవెలబారింది. గాభరా పడ్డావు. అన్నీ కలియవేసుకున్నాను. చేర్చాను. పెద్ద కథ అయింది. ఇంతలో నీవు వచ్చావు. 'టీ' యిచ్చావు. ఓరగంట నన్ను చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వుతూన్నావు. దేనికి? నీపగ్గకు సంతోషించి; టోపీ దాచేశావుగా! గొప్ప పగ్గె! వచ్చినవాడు పోయేటప్పుడు టోపీని వదిలి పోవడ మెందుకు? గాభరా! నే నింటికి వచ్చానని గాభరా! చూస్తానని గాభరా! తప్పించుకో పోవాలెనని ఆత్రం—నీకు అంతకంటే ఆత్రం. పంపించే ఆత్రం, తలుపు తెరిచే ఆత్రం, అంతాఆత్రం, అంతాగాభరా! మరచి పోయినారు. టోపీని మరిచి పోయినారు. 'టీ' నాకీయవచ్చినప్పుడు దాన్ని చూచావు. ముసిముసినవ్వులందుకే. నామీద విసిరిన ఓరచూపులందుకే. చూచాడేమో! ఏమో! ఏమో! పట్టెది పెద్ద అనుమానం. లోలోపలనే దాచాను. పరీక్షించాను. ఎటు చూచినా అనుమానమే. ఛీ—ఈబతుకుకంటే చావే నయమనుకున్నాను. అందుకు సిద్ధమైనాను. ఇంక—"

"ఇంక నామాట వినండి అంతా తెలిసింది. అప్పుడే నన్నడిగివుండరాదూ; ఇంతదూరం అయినచ్చి వుండునే! ఇంకాకొంతకాలం దాచాలె ననుకున్నాను. ఇంత కువచ్చింది. ఇంక దాచీ లాభం లేదు. ఇక తీరుస్తాను మీ అనుమానం వినండి—శాంతంతో వినండి.

మనద్రవ్య మంతా బ్యాంకు దివాలాతోటీ పోయింది. మీరు విచారంతో వున్నారు. కర్చు తగ్గించి మిమ్మల్ని సంతోషపెట్టాలె ననుకున్నాను. ఏదో సంపాదిస్తూన్నారు—వంటిమీద నగలున్నవి—సరికదా నా కొక ఆలోచన తోచింది. పెద్దమొత్తంగా ఒక్కసారిగా రొక్కం మీకు చూపి ఇది నా స్వార్జితం అనిచెప్పుదామనుకున్నాను. అందుచేత మీకు తెలుపకుండానే యీ టోపీ—"

"ఆఁ-ఆఁ- మాయి!నోరు మూయి! మాయలాడీ! సిగ్గుమాలినదానా! మూయింక! నాయెదుటనే నీనోటిగుండనే చెప్పుతూన్నావుగా? గొప్పమొత్తంలో రొక్కం నాకు చూపాలెనని నేనింతదరిద్రస్థితిలో వున్నందుకు నాకు సహాయం చేయాలెనని నీవు నీతిమాలి, సిగ్గువిడిచి, విశ్వాసఘాతంచేసి, ఆటోపీవాని చేపట్టి—"

"కాదు—శాంతించండి అది కాదు నావుద్దేశం. పూర్తిగా వినండి."

"చాలు—విన్నదిచాలు—చెప్పినదిచాలు—నీనాలుక చీలిపోదూ! ఛీ!పో—ఆవలికి తొలగిపో—నీముఖం నాకు చూపకు, నీచురాలా! నీ నీతిమాలిన చరిత్ర—నీ నోటితో—"

"వినండి—పోను—తొలగిపోను — చాలించను. పూర్తిగా నాపలుకులు విని, ఆతర్వాత మీకిష్టము వచ్చినట్లనండి. మిమ్మల్ని సంతోషపెట్టవలెనని—ఇది అంతా నా స్వార్జితం—కష్టార్జితం, అని చెప్పుదామని బుద్ధిపుట్టింది. మన సరస్వతితోటి ఆలోచించాను. నలుగురు నేస్తులం కలిశాము. మా కంపెనీకి చంకీబుటేదారీపని చేతవును. ఆవిద్య సమయానికి పనిక వచ్చింది. మీరు భోంచేసి కోర్టుకు వెళ్లిపోయిన తరువాత అందరం కలిసి టోపీలు కుట్టేవాళ్లం. ఆరోజూ, టోపీ కుట్టుతూండి, అప్పుడే వంటయింట్లో పిల్లి యేదో పడవేస్తే, చేతిలోని టోపీని బల్లమీద పెట్టి పోయినాను. అంతలో మీరు వచ్చారు. తలుపు తెరిచాను. మీముఖం నల్లబారివుంది. అవేళకు యింటికి వచ్చారు ఎందుకా అని భయపడ్డాను. జబ్బేమయినా కలిగిందా ముఖం యీలాగున్న దెందుకా అని గాభరాపడ్డాను. అలసివచ్చారుకదా త్వరలో,'టీ'కాచి తెద్దామని లోపలికి పరిగెత్తాను. మీరు మీగదిలో వుంటారనుకున్నాను. టోపీ దాచలేదు. గది తలుపుమాత్రం ముందుకు వేసినాని'టీ' కాచపోయినాను. మీముఖమిల్లాగున్నందుకు నా మనసు స్తిమితం లేకపోయింది. టోపీ సంగతే మరిచాను. 'టీ'తీసికుని మీగదిలోనికి వెళ్లాను. అక్కడ లేరు. నాగదిలోకివచ్చాను. మంచానికి అడ్డంగా పడివున్నారు. టోపీ దాచేశాను, మీరుచూడ లేదనుకున్నాను."

"అప్పటి నీయోర చూపులకు అర్థమేమి."

"అనుమానం—చూశారేమో—ఏమనుకున్నారో? ఎవరిది అనుకున్నారో? అడుగుతారేమో ఏమి చెప్పాలె?

నిజం చెప్పాలెనా? ఇంకొంతకాలం దాచాలెనా? — అదే విచారం — ఆలోచనా. భర్తతో తెలుపకుండానే భార్య లేవ్యవహారమైనా చేయడం తప్పు. నేను తప్పు చేశాను. కోప్పడుతారేమో అని భయం. నా మనసు మనసులో లేదు. ఎన్నివిధాలో —"

"నిజమేనా. నీమాటలు నమ్మవచ్చునా?

"నమ్మండీ! నిజమే చెపుతున్నాను. ఒక్క టోపీని చూచి నన్నింతగా అనుమానించి దూషించి అవమానించారుకదా. అదిగో చూడండి." అని అంటూ మను లేచి వెళ్లి ఒక పెట్టె తెచ్చి తెరచి నాకు చూపింది. "ఇదిగో వలభై టోపీలు. అన్నీ యీమోస్తరువే కదా! ఇన్నిటినీ చూచి యింకా యెంతగా అనుమానిస్తారో ?"

అని అంటూ మనూ పరమానందంతో నవ్వసాగింది; నాకాశ్చర్యం కలిగింది. నా నేత్రాల్లో బాష్పాలు కురుస్తూన్నవి. నాలోనే నేను పశ్చాత్తాపపడ్డాను.

నాకేదో ఒక విచిత్రమైన వికారం కలిగింది. అంతకంటే యెక్కువగా సిగ్గయింది. పట్టలేక పోయినాను. తటాలున మంచం మీదనుండి లేచి క్రిందకి దిగాను. మను నా భావం గ్రహించింది కాబోలు నన్ను తటాలున పట్టుకుని మెల్లగ మంచం మీద కూర్చోపెట్టింది. నాకంతా



న్ని తన రెండు చేతులా పెనవేసి, నా ముఖం కొంచెం పైకెత్తి "ఏమీపని? కూర్చోండి" అన్నది. నా కంఠాల్లో నీరు గిర్రున తిరిగివచ్చినది. కంఠం బొంగురుపోయింది!

"మనూ! తప్పు మన్నించవూ? వజ్రాన్ని గాజుముక్క అనుకున్నాను నీలమణిని బొగ్గనుకున్నాను. అమృతమును విషంగా భావించి పారపోశాను. నీవిలువ నాకు తెలియక పోయింది. తెలిసీ మూర్ఖంగా భ్రమతలో పడ్డాను. మహాఘోరంగా అనుమానించాను. నీ శీలాన్ని సంశయించాను. తప్పు క్షమించు మనూ! కోపపడకు. నా యింటి లక్ష్మివని తెలిసికోలేక భ్రమపాలై నిక్కు కన్నులు మూసుకుని, బుద్ధి క్షీణించగా, మోసపుకారితో తన్నేసినాను. క్షమించు మనూ! —"

అని నేను దీనభావంతో అంటూండగా మను నా నోరు నొక్కిపట్టింది. నన్ను తన హృదయానికి బిగ్గబట్టింది. ఆకంఠాల్లో బాష్పాలు కురుస్తూన్నవి. అందులోనూ మనూ మొహం మీద చిరునవ్వు తాండవమాడుతూంది. నన్నామె గాఢంగా కౌగిలించుకొని, నా ముఖం కొంచెం పైకెత్తి తనముఖం దగ్గరగా చేర్చి మిక్కిలి ప్రేమతో యిట్లన్నది.

"ఇందులో నేను క్షమించవలసిన దేమి? తప్పు నాదే. నన్ను మీరు క్షమించాలె. భర్తకు తెలుపకుండానే రేలాంటి వ్యవహారం చేయడమూ భార్యకు తగదు. నేనంతస్వతంత్రంగా మాలో నన చేయలేదు. మేమందరం కలిసి టోపీలుకుట్టి, మన సరస్వతీ భర్త షాపులోకి పంపి వానిమీద వచ్చిన పైకం పెద్దమొత్తం మీకు చూపి విస్మయాన్ని ఆశ్చర్యంలో తేలుస్తామనుకున్నాము. అదే ఉత్సాహంగాని, యింతవుతుందని అనుకోలేదు. పోనిండి ఇంకనైనా నన్ను వెనుకటివలె ప్రేమిస్తారా ? నన్ను నమ్ముతారా? ఇంకనైనా వదిలిందా మీ అనుమానపిశాచం?"

నా హృదయం కృతజ్ఞతతో మహానందంతో సిగ్గుతో అపరిమితమైన ప్రేమతో నిండిపోయింది. నేను మనూ నొక్క విధంగా చూచాను. అంతలోనే మను చిరునవ్వు నవ్వింది. ఆక్షణామే పెదవుల్లు నాలుగు కలిసిపోయినవి.